RNI NO: APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 178 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజీలు : 8 వెల రూ. 2 మంగళవారం -29 - సెప్టెంబర్ - 2026
Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


2లో

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే!

- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ

# చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలి

## పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం

- ★ చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం.. అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కల్యాణ్
- ★ ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- ★ మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం



అమరావతి: చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో మిగతా 2 లో

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్.. 372 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల


2లో

- 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో 372 మందికి పట్టాల పంపిణీ
- కుంచనపల్లిలో లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన మంత్రి నారా లోకేశ్
- నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందన్న మంత్రి
- రెండు విడతల్లో రూ.2 వేల కోట్ల విలువైన భూములకు శాశ్వత హక్కులు
- ఎన్నికల హామీ మేరకు దీర్ఘకాలిక సమస్యకు లోకేశ్ పరిష్కారం

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి



## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

# నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



అమరావతి: బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ మిగతా 2 లో


2లో

## ఆయుధాలు కొంటారా?.. జిన్‌పింగ్‌ను నేరుగా అడిగిన ట్రంప్!

- అమెరికా ఆయుధాలు కొంటారా? అని అడిగిన ట్రంప్
- ఈ విషయాన్ని వెల్లడించిన చైనాలో అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ
- అమెరికా చట్టం ప్రకారం చైనాకు ఆయుధాలు అమ్మడంపై నిషేధం
- చైనాకు ఆయుధాలు అమ్మే ప్రణాళిక లేదన్న వైట్ హౌస్

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం..

# మేనమామలా మారిన సీఎం విజయ్

## 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్



తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మిగతా 2 లో

## 'మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..

# ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

## 'మన్ కీ బాత్'లో ఉసిరిని సూపర్‌ఫుడ్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ

- ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఉసిరి పరిశ్రమ విజయవంతమైందని వెల్లడి
- మహిళా స్వయం సహాయక బృందాల ఆదాయం పెరిగిందన్న ప్రధాని
- పోషకాహార లోపాన్ని తగ్గించడంలో ఉసిరి కీలకమని వ్యాఖ్య
- 'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి ఉసిరి సాగు ఊతమిస్తుందని పిలుపు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. మిగతా 2 లో


2లో

## ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

- తెలంగాణపై ఎల్ నినో ప్రభావం
- సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న ఎండలు

# కాంగ్రెస్ కసరత్తు.... ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి?

## రెండు స్థానాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది

- ➢ గవర్నర్ కోటా మూడు స్థానాల పదవీకాలాలు నవంబర్‌లో ముగియనున్నాయి
- ➢ ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు పేర్లతో పీసీసీ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం
- ➢ అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం
- ➢ సెప్టెంబర్ 29న ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం కీలక సమావేశం నిర్వహించి అభ్యర్థులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం



హైదరాబాద్: తెలంగాణలో ఖాళీ కానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు

## బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే.. పోలీసుల పహారా ఎందుకు?



- ▶▶ 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- ▶▶ రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నారు
- ▶▶ ఇందిరమ్మ రాజ్యం అంటే.. పేదల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా?

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

## లబ్ధిదారులకు చెక్కులు

### – ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

**పరిగి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి లతో కలిసి పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన వారికి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం



చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకుసూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, ఎమ్మార్వో వెంకటేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాములు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండెల రామకృష్ణారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, కౌన్సిలర్లు అఖిల శ్రీనివాస్ గుప్తా, ఏజాజ్, యూసఫ్, అరిఫ్, కో ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, అక్బర్, మాజీ పరిగి పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ రెడ్డి, చంద్రయ్య, వెంకటేష్, చిన్న నరసింహులు, నాగవర్ధన్, మాణిక్యం, ముస్తఫా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### – జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో ఈరోజు అందిన118 దరఖాస్తులతో పాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా అధికారులు సిబ్బంది మీ ప్రమాణం మొబైల్ యాప్ ద్వారా తమ హాజరును (అటెండెన్స్) తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డిఆర్ఓ స్వర్ణలత, జెడ్పి సీఈవో సుధీర్, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# హైవే కేఫ్ ఓటల్ ను ప్రారంభించిన

### -ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణంలో నీ హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'హైవే కేఫ్'ప్రారంభోత్సవ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే 'హైవే కేఫ్' ను ప్రారంభించారు.అనంతరం హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యాజమాన్యం ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలన రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనబెరేజ్ వేయండి!

**:-పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**

**10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో మీ గ్రామాలలో ఏమీ అభివృద్ధి జరిగింది**

**రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో మీ గ్రామంలో ఏమి అభివృద్ధి జరిగింది**

**ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాం , రేషన్ కార్డులు ఇచ్చాం ఇంకా అవసరమున్నవారికి ఇవ్వడం జరుగుతుంది**

**రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందజేయడం జరుగుతుంది**

**పది సంవత్సరాల పాలనలో పరిగి నియోజకవర్గంలో ఏ గ్రామంలో అయినా మీరు చేసిన అభివృద్ధి ఏమిటి మేము చేసిన అభివృద్ధి ఏమిటి? ఒకసారి ఆలోచించండి నాయకులు కార్యకర్తలు అందరూ కూడా**

**మేం చేసే పనులు మాత్రమే మాట్లాడుతున్నాం చేసిన పనులు మాట్లాడుతున్నాం మీరేం పనులు చేశారో చెప్పండి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు, సోమవారం పరిగి మున్సిపల్ పరిధిలోని నస్కల్ మొదటి వార్డులో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను, రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోజు నస్కల్ గ్రామంలో ఏమి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పనుల్లో మీ గ్రామంలో ఏమి అభివృద్ధి జరిగింది ఏవి పనులు చేశారు ఒక ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారా ఒకరికి రేషన్ కార్డు ఇచ్చారా ఏం పనులు చేశారు మీరు ఆలోచించండి. రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు సన్న బియ్యం అందరికీ అందేలా చూస్తున్నాం అర్హులకు, ఈరోజు మీకు కనిపించడం లేదా ఇంట్లో నుంచి బయటికి వెళ్తే చాలు రోడ్లు ఫోర్ లైన్ హైవే పనులు జరగడం లేదా కళ్ళతో చూస్తూ ఎందుకలా మాట్లాడుతున్నారు.





పరిగి లో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంత చూసుకుంటూ అభివృద్ధి ఎక్కడ అంటే ఏం చెప్పాలి? మీరు ఎక్కడ అభివృద్ధి చేశారు ఏడ అభివృద్ధి జరిగింది మీరు ఏం చేశారు 10 సంవత్సరాల కాలంలో పరిగి నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి చేశారు ప్రతి ఒక్కరు ఈ విషయంలో ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టండి అభివృద్ధి చేసే నాయకులను ఆశీర్వదించండి అభివృద్ధి కోసం ఆలోచన చేయండి సమస్యల కోసం పరిష్కారం చేయడానికి మీ ఇంటిలో ఒక పెద్ద కొడుకులా నేను అర్ధరాత్రి మీకు అండగా ఉంటాను మీకోసం పనిచేసే నాయకుడిని మీరందరూ నాకు అండగా ఉంటారు. ఆ అర్ధరాత్రి మీ పెద్దకొడుకుల మీ సమస్యలు పరిష్కారం చేయుటకు నేను సిద్ధంగా ఉన్నాను మీ సమస్యలు నాతో చెప్పండి వీలైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తాను అంటూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఇలా నస్కల్ గ్రామంలో రైతులకు వెళు ౣటకు పానాది రహదారి రోడ్డు పనులు సైతం త్వరలోనే స్టార్ట్ చేయడం జరుగుతుందని నస్కల్ సర్వతో ముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగె మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పిఎసిఎస్ చైర్మన్ రజిత రాజ పుల్లారెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, పరిగి మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుల్తాన్పూర్ ఫిరంగి వెంకటరామిరెడ్డి, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, నస్కల్ కౌన్సిలర్లు లక్ష్మీ చంద్రయ్య, అక్కమ్మ తనయుడు బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య శ్రీధర్ బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్, మండల ఎస్సీ సెల్ తావూరియా నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు

# కొత్తపేటలో మూడు రోజులపాటు

### ఘనంగా జరిగిన అంగన్వాడీ ఉత్సవాలు



మహి న్యూస్ కొత్తపేట, సెప్టెంబర్ 28: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకుని కొత్తపేట ప్రాజెక్టు పరిధిలో ఐసిడిఎస్ సిడిపిఓ ఏ. గజలక్ష్మి ఆదేశాల మేరకు అంగన్వాడీ ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించారు. ఐసిడిసి సూపర్వైజర్ షేక్ ఫాతిమాబీబీ ఆధ్వర్యంలో మూడవ రోజు సోమవారం చినగూళ్ళపాలెం,గౌతమి నగర్,శ్రీనివాస పేట, పినిపేవారి పేట, గోగి వారి పేట, రెడ్డప్ప వారి పేట, కమ్మిరెడ్డి పాలెం, రామారావు పేట, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రతి లబ్ధిదారునికి అంగన్వాడి సేవలు వినియోగించు కునే విధంగా, పౌష్టికాహారం విలువలను వివరించడం, పౌష్టికాహారం తయారీ కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు.అంగన్వాడీ ఉత్సవ్ లో



భాగంగా పిటి పోషణ్ ట్రాకర్ లో లబ్ధిదారుల నమోదు, పి ఎం ఎం వి వై పథకంలో నమోదు, మిషన్ ఇంద్రధనుష్ లో నమోదు, పి.బి.పి.బి కార్యకర్తలకు శిక్షణ, అంగన్వాడీ సేవల్లో, పోషణ్ మాస్ లో లబ్ధిదారుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. పోషణ్ ఉత్సవాలలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన, తల్లిపాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై చైతన్యం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ కోసం ఈరోజు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది అందించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహార లోపాల నివారణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశ వర్కర్లు చంటి పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత:-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లాలోని కాలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి జిల్లా అధికారులతో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 ను పురస్కరించుకొని వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అవగాహన, సామాజిక అనుసంధానం, చట్టపరమైన హక్కులు, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నుంచి రక్షణపై అవగాహన, 29న తరతరాల మధ్య అనుబంధం, పరస్పర అభ్యాసం కార్యక్రమాలు, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య పరిరక్షణ, వాకథాన్, అక్టోబర్ 1న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం--2007, నియమాలు--2011 ప్రకారం వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న హక్కులు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్ 14567 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, పోలీస్ హెల్ప్‌లైన్ 100ను సంప్రదించవచ్చని తెలిపారు. వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ గౌరవం, భద్రత, సహకారం అందిస్తూ వారి సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ స్వర్ణలత, వయోవృద్ధుల సంక్షేమ అధికారి కాంతారావు, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ డి డి ఎ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలి

### – రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- ఆహారం, పారిశుద్ధ్యం, హాజరు, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ
- విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు
- చలికాలంలో వెచ్చని నీరు, దుప్పట్లు అందుబాటులో ఉంచాలి
- దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు
- ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి
- రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల




భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అందుతున్న మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్లు క్రమం తప్పకుండా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఆహార విషబాధ, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వంటశాలలను ఆధునీకరించే అవకాశం ఉన్న చోట్ల పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యాసంస్థల్లోని సౌకర్యాలు, లోపాలు, చేపట్టిన పరిష్కార చర్యల వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులను ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుంటుందని తెలిపారు. జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ప్రతికూల నివేదికలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సీఎస్ సూచించారు. ఏదైనా సమాచారం తప్పుడు ప్రచారంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇకపై ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు తీసుకోవాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్ పి సి ఇ ఓ సుధీర్, శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి ఘని , ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జయపాల్ రెడ్డి, బీసీ మాధవరెడ్డి, జనార్ధన్ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు



## ప్రజా సమస్యల పరిష్కారంపై మంత్రి పయ్యావుల ప్రత్యేక దృష్టి

### ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

### సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. అనంతపురం రాంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల



నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులను స్వయంగా స్వీకరించిన మంత్రి, ప్రతి సమస్యను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతోందని, సమస్యల పరిష్కారంపై అధికారులు స్పందించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## పల్లె పండుగ 3.0తో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి

### రూ.11,085 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు

### 15,500 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం

### మినీ గోకులాలు, డ్రైన్లు, ఉద్యానవనాల ఏర్పాటుకు నిధులు




అమరావతి, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమం కింద మొత్తం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో రూ.10,250 కోట్లతో 15,500 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్ల ఏర్పాటు చేయనున్నారు. అలాగే రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాలు, రూ.200 కోట్లతో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### అర్జీలను నాణ్యతగా, నిర్ణీత గడువులో పరిష్కరించాలి

### భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### పీజీఆర్ఎస్‌లో 497 అర్జీల స్వీకరణ



అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల మేరకు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు వివాదాలు, రికార్డుల్లో తప్పులు, విస్తీర్ణ వ్యత్యాసాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ 1100 టోల్‌ఫ్రీ సేవ ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా బాధ్యతగా పరిష్కరించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు తప్పనిసరిగా హాజరై పెండింగ్ అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా 497 అర్జీలు అందగా, వాటిలో 255 రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించినవి, 242 ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, రెవెన్యూ అధికారి ఏ. మాలోల, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున రెడ్డి, ఆనంద్, వెంకటనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువత భవితకు భరోసాతో విద్యార్థినులకు మార్గదర్శనం

### కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కార్యక్రమం

### విద్యార్థినులతో ముచ్చటించిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

### మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ






అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): అనంతపురం నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్యా, మౌలిక వసతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. త్వరలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు అదనపు



తరగతి గదుల కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదవాలని, విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్, ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు బీసీ స్టడీ సర్కిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి, అన్నపూర్ణ, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్లకు తక్షణమే నిధులు కేటాయించాలి

### నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి..

### చలో కలెక్టరేట్‌లో ఐక్యవేదిక డిమాండ్

అనంతపురం, సెప్టెంబర్ 28 (మహి న్యూస్): ఎస్సీల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ఎస్సీ కార్పొరేషన్లకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను తక్షణమే కేటాయించి, నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక, 50






సంఘాల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమంలో విద్యార్థి, కుల, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్లు ఏర్పడినప్పటి నుంచి అనేక సంక్షేమ, స్వయం ఉపాధి పథకాలు అమలయ్యాయని తెలిపారు. గత కొంతకాలంగా తగిన బడ్జెట్ కేటాయింపులు లేక కార్పొరేషన్లు నిధుల కొరతతో నిర్వీర్యమయ్యాయని, వేలాది మంది లబ్ధిదారులు ప్రభుత్వ సహాయానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్లకు కేటాయించాల్సిన నిధులు, గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తక్కువ వడ్డీ రుణాలు, రాయితీలతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేవారని, ప్రస్తుతం అవి అందుబాటులో లేకపోవడంతో నిరుద్యోగులు, పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, స్వయం ఉపాధి పథకాలు, రుణాలు, రాయితీ పథకాలను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్లను బలోపేతం చేసి పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా, విద్యార్థి, దళిత సంఘాలను ఏకం చేసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో విస్తృత ఉద్యమాలు చేపడతామని ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుల్యం నాగభూషణ్, కేపీ నారాయణస్వామి, రాచేపల్లి రామాంజి, గట్టు రామాంజనేయులు, కేపీ రాజు, ఓబుళపతి, వెంకీ, ముండ్ల రాము, మద్దెలచెరువు ప్రకాష్, రామాంజనేయులు, ములకనూరు ఎల్లప్ప, కుమార్ స్వామి, చిరంజీవి, హేమంత్, మల్లేష్, గుర్రం రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై పటిష్ట చర్యలు చేపట్టాలి

### నాలుగు రకాల వ్యర్థాల విభజనను కట్టుదిట్టంగా అమలు చేయాలి

### ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు -జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): జిల్లాలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో వ్యర్థాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ప్రతి మున్సిపాలిటీ, మండల పరిధిలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. వారు కాలుష్య నియంత్రణ మండలి పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే నెలలోగా నాలుగు రకాల వ్యర్థాల విభజనను కచ్చితంగా అమలు చేయాలని, తడి వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ, రీసైక్లింగ్, వ్యర్థాల ద్వారా ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి మండలంలో ఒక గ్రామంలోా= కోడ్ ఆధారిత వ్యర్థాల నిర్వహణను పైలట్‌గా అమలు చేయాలని



సూచించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని, వ్యర్థాల సేకరణ వివరాలను యాప్ ద్వారా నమోదు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్, సోక్‌పిట్ల నిర్మాణం, కంపోస్ట్ పిట్ల ఏర్పాటు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలో వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక, కాలపట్టిక సిద్ధం చేసి అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నాగరాజు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలి

### కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నవంబర్‌లోగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాలు, దేవాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలు వంటి ముఖ్య ప్రదేశాల్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి క్లోరినేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగించాలని ఆదేశించారు. ఇంకా క్లోరోస్కోప్‌లు అందుబాటులో లేని 52 పంచాయతీలకు వారంలోగా వాటిని కొనుగోలు చేసి అందించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నాగరాజు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ సోలార్ విలేజ్ పోటీకి 5 గ్రామాలు

### రూ.కోటి గ్రాంట్ సాధించే అవకాశం

### సోలార్ సిస్టమ్‌ల ఏర్పాటును పెంచాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): పీఎం సూర్య ఘర్ పథకం కింద అనంతపురం జిల్లాలోని నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ గ్రామాలను మోడల్ సోలార్ విలేజ్ పోటీకి ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. మూడు నెలల పాటు ఐదు గ్రామాల మధ్య సోలార్ పోటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కాలంలో అత్యధికంగా సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్న గ్రామానికి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి ప్రోత్సాహక నిధులు అందించే అవకాశం ఉందన్నారు. గ్రామానికి అందే నిధులను మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎంపికైన ఐదు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## యువత భవితకు భరోసా కార్యక్రమం

### విద్యార్థులతో ముచ్చటించిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

### నైపుణ్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలి




అనంతపురం, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): అనంతపురం రూరల్‌లోని శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ, ఆదర్శ నర్సింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వైద్య, ఆరోగ్య రంగంలో ఫిజియోథెరపిస్టులు, నర్సుల సేవలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యతో పాటు మానవతా విలువలను అలవర్చుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మధ్యవర్తిత్వంతో వివాదాలకు స్నేహపూర్వక పరిష్కారం



జమ్మలమడుగు, సెప్టెంబర్ 28, (మహి న్యూస్): న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నాల్సా మధ్యవర్తిత్వం--3.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం జమ్మలమడుగులో మధ్యవర్తిత్వంపై న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వకంగా, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కుటుంబ, ఆస్తి, వ్యాపార తదితర వివాదాలను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించుకోవచ్చని వివరించారు. మధ్యవర్తిత్వంలో ఇరుపక్షాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని పరస్పర అంగీకారంతో పరిష్కారానికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.





వివాదాలను మరింత జటిలం చేసుకోకుండా చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. "మీ సమస్యకు శాంతియుత పరిష్కారం లభించే అవకాశాన్ని వదులుకోకండి.. మధ్యవర్తిత్వం--3.0ను సద్వినియోగం చేసుకోండి" అని అవగాహన కల్పించారు. వివాదాలకు ముగింపు పలకడంతో పాటు పరస్పర సంబంధాలను కాపాడుకోవడంలో మధ్యవర్తిత్వం సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, అవసరమైన వారు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సేవల సహాయవాణి 15100పై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. సమస్యలు ఉన్నవారు జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితి లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడపను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు చైర్మన్ కం జూనియర్ సివిల్ జడ్జి ఎ. ఉమర్ ఫరూక్, రెండో తరగతి న్యాయమూర్తి టి. శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ రెడ్డి, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, మధ్యవర్తులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు సబ్ జైలు, న్యాయ సహాయ కేంద్రం పరిశీలన



ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 28, (మహి న్యూస్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రొద్దుటూరు సబ్ జైలు, న్యాయ సహాయ కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ సూచనలతో ఈ పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా జైలులోని వివిధ రిజిస్టర్లను పరిశీలించి, న్యాయ సహాయ కేంద్రం పనితీరును సమీక్షించారు. జైలులో ఉన్న ఖైదీలను కలిసి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు లభించే న్యాయపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల వ్యవస్థపై అవగాహన కల్పించారు. అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైతే ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితి లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడపను సంప్రదించాలని తెలిపారు. న్యాయ సేవల సహాయవాణి 15100పై కూడా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.



## రేబీస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

### 'కలిసి ఉంటే మరింత బలం' నినాదంతో అవగాహన

### కుక్క కరిచిన వెంటనే వైద్య చికిత్స పొందాలి




నంద్యాల, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ రేబీస్ దినోత్సవం-2026' పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శారదాబాయి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ ఎస్. అశ్రుఫ్ ఆలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 'కలిసి ఉంటే మరింత బలం' అనే నినాదంతో రేబీస్ వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కుక్కలు, ఇతర జంతువులు కరిచినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో శుభ్రంగా కడిగి, ఎలాంటి ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యసంస్థను సంప్రదించాలని తెలిపారు. వైద్యుల సూచన మేరకు యాంటీ రేబీస్ టీకా, అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. 'రేబీస్‌ను నివారించవచ్చు - అవగాహనతో ప్రాణాలను కాపాడవచ్చు' అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డీపీఎంవో అధికారి డాక్టర్ శ్రీనివాసులు,డాక్టర్ శ్రీజ,ఇతర వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

### వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

### ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోపు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**



నరసరావుపేట, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరిపి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ కృతిక శుక్లా, డీఆర్వో అద్దయ్య, డీపీఓ నాగేశ్వర్ నాయక్‌తో కలిసి మొత్తం 109 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని, గడువు దాటిన పెండింగ్ అర్జీలు, తిరిగి తెరవాల్సిన పరిస్థితులు రాకుండా నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, మానవతా దృక్పథంతో సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరుల అభిప్రాయ సేకరణ క్యూఆర్ కోడ్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేసేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లాలోని 1,556 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు

### మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల ప్రక్రియ

### ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.ఎం.డి. రామారావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ తెలిపారు. జిల్లాలోని 1,205 ప్రాథమిక, 54 ప్రాథమికోన్నత, 297 ఉన్నత పాఠశాలలు.. మొత్తం 1,556 పాఠశాలల్లో సెప్టెంబర్ 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సెప్టెంబర్ 25న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ఎన్నికలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని, అనంతరం ఎన్నికైన సభ్యుల వివరాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

### నంబూరు గ్రామపంచాయతీ పరిధిలో సభా స్థల పరిశీలన

### ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులకు ఆదేశం



గుంటూరు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): గుంటూరు జిల్లాలో అక్టోబర్ 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. తొలుత తెనాలి మండలం బుర్రిపాలెంలో సభ నిర్వహించేందుకు ప్రతిపాదించగా, ప్రస్తుతం పెదకాకాని మండలం నంబూరు గ్రామపంచాయతీ పరిధిలో సభా స్థలాన్ని పరిశీలించారు. దశావతార దేవాలయం సమీపంలోని స్థలంతో పాటు ఇతర ప్రాంతాలను పరిశీలించి అనుకూలతలను తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, డీఎస్పీ సి.హెచ్. మురళీకృష్ణ, ఆర్అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాసమూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, గృహ నిర్మాణ సంస్థ ఈఈలు డి. రమాకాంత్, ఎడ్ల భాస్కరరావు, తహసీల్దార్ ఫణి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

### అర్జీలను నిబంధనల మేరకు మానవతా దృక్పథంతో పరిశీలించాలి

### నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలి

### పరిష్కారం సాధ్యం కాని అంశాలకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలి



గుంటూరు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించే అర్జీలను నిబంధనలకు లోబడి మానవతా దృక్పథంతో పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను జాయింట్ కలెక్టర్ స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందనే ఆశతో అర్జీలు సమర్పిస్తారని తెలిపారు. అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యం కాని అంశాలకు స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి

### సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలి

### ఎన్నికల పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలి



గుంటూరు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు సిజేరియన్ ప్రసవాలను తగ్గించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వివిధ శాఖల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో అసంక్రమిత వ్యాధుల సర్వేను పూర్తి చేయాలని, మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో త్రీ స్టార్ రేటింగ్ పెంచాలని, వసతి గృహాల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల్లో కనీసం 20 వేల మంది యువతను నమోదు చేయాలని, ఈ-పంట నమోదును వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. జలధార-జలహారతి రెండో దశలో మంజూరైన 287 పనుల్లో మిగిలిన పనులను రెండు రోజుల్లో ప్రారంభించాలని, పల్లె పండగ-3.0లో పశువుల శాలల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో పెండింగ్‌లో ఉన్న 19 నోటీసులను మంగళవారం నాటికి పూర్తి చేయాలని, ఓటరు జాబితాలో ఫోటోల పరిశీలనను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

# నరసరావుపేటలో 30న ఉద్యోగ మేళా

### 12కు పైగా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు

### రూ.13 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం

### 18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం

నరసరావుపేట, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీనివాస ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు, శ్రీనివాస ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ యడ్ల లక్ష్మణుడు తెలిపారు. నరసరావుపేటలోని పారిశ్రామిక వాడలో, రిలయన్స్ ట్రెండ్స్ వెనుక వైపు ఉన్న శ్రీనివాస ఐటీఐ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో హెటిరో డ్రగ్స్, గోదావరి ఆంధ్రా ముటువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, యూనిటీ మోటార్స్ వర్క్స్, ఫాక్స్‌కాన్, ఎస్‌బీఐ కార్డ్స్,



Andhra Pradesh State Skill Development Corporation
Department of Skill Development& Training
Government of Andhra Pradesh
JOBMELA - DATED: 30-Sep-2026(Wednesday)

| S. No | Company Name | Work Location | Job Role | Qualification | Salary | Vacancies | Gender | Age Group |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | GODAVARI ANDHRA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT & CREDIT SOCIETY LIMITED | Narasaraopet, Chilakaluripeta, Macherla Bapatla, Ponnur, Cherala | Junior/Senior Business Officers, Branch Incharges/ Managers/Collection Officers/Loan Officers/Front Office/Clerk/Asst.Clerk | Any Degree/PG | Rs.14000-22000 PM | 40 | Male/ Female | 22+ |
| 2 | Hetero Drugs | Hyderabad | Jr Chemist & Officer/Jr. Technitian | Intermediate/AnyDegree/B.Sc-Chemistry/M.Sc Chemistry/ITI-Fitter&Electrician | Rs 1.6 LPA-2.8 LPA | 100 | Male | 18-25 |
| 3 | UNITY MOTOR WORKS LLP(TVS Showroom) | NARASARAOPET, VINUKONDA, CHILAKALURIPET. | Sales Executives and Service Technicians, Tele Callers | Inter/ITI/Diploma/ Any Degree | Rs. 10000-25000 PM | 15 | Male/ Female | 19-35 |
| 4 | SBI Cards | Narasaraopet,All Over Palnadu and Guntur District. | BREs( Inside Bank) & RE and SO , Team Leader, RMs and Trainers, BDM | Inter/Any Degree | Rs.20000-35000 PM | 50 | Male/ Female | 18-35 |
| 5 | Foxconn-Banglore | Devanahalli,Banglore | Operator | SSC And above | Rs.19000 PM | 100 | Female | 18-32 |
| 6 | Tata Wistron | Narsapura, Banglore | Operator | SSC And above | Rs.19000 PM | 80 | Female | 18-29 |
| 7 | Oben Electric | Jigini, Banglore | Operator | SSC And above | Rs.19000 PM | 100 | Male | 18-29 |
| 8 | Avishkaran Industries Private Limited | Fab City,Hyderabad | Operator | SSC And above | Rs.18000 PM | 100 | Male/ Female | 18-32 |
| 9 | Zepto(Warehouse) | Guntur, Hyderabad,Vijayawada | Scanners,Pickers & Packers. | SSC/Inter/ITI/Any Degree | Rs.24000 PM | 100 | Male/ Female | 18-30 |
| 10 | Navata Road Transport | Vijayawada,Nellore, Kadapa and Rajamundry | Supervisors | SSC/Inter/ITI/Any Degree | Rs.17500-21000 PM | 50 | Male | 18-30 |
| 11 | Bigbasket | Guntur, Vijayawada & Hyderabad | Delivery Executives | SSC/Inter/Diploma/Any Degree | Rs.30000-40000 PM | 50 | Male | 18-35 |
| 12 | Patchala Spintex | Rajupalem, Palnadu District | Operators, Fitters & Electricians | 10th to Degree & ITI | Rs. 10,000-15,000 PM | 70 | Male/ Female | 19-35 |

Venue:- Srinivasa ITI College, Reliance Trends Back Side 1st Line, Industrial Estate, Peddacheruvu, Narasaraopet, Palnadu Dist.
For More Details Contact- Veeranjaneyulu.M (9160200652),Anji Reddy (7779858789)
Website Link: https://naipunyam.ap.gov.in

టాటా విస్ట్రోన్, జెప్టో, అవిష్కరాన్ ఇండస్ట్రీస్ తదితర సుమారు 12 కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్హత, ఉద్యోగాన్ని బట్టి నెలకు సుమారు రూ.13 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ బయోడేటా లేదా రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని తెలిపారు.

**ఉద్యోగ మేళా వివరాలు:**

**తేదీ: సెప్టెంబర్ 30, బుధవారం**

సమయం: ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు

వేదిక: శ్రీనివాస ఐటీఐ కళాశాల, రిలయన్స్ ట్రెండ్స్ వెనుక వైపు, పారిశ్రామిక వాడ, పేదచెరువు, నరసరావుపేట. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నమోదు చేసుకోని వారు ఉద్యోగ మేళా ప్రాంగణంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: వీరాంజనేయులు: 9160200652 అంజిరెడ్డి: 7779858789

# సాగునీరు కష్టతరమే ..!

### ఆయు కట్టు రైతుల్లో నిరుత్సాహం

### ఆరుతడి పంటలపై దృష్టి

### అడుగంటి పోతున్న బోర్లు

కారంపూడి సెప్టెంబర్ 28:(మహి న్యూస్): రైతులు ఎంతో ఆశతో సాగునీరు విడుదల చేస్తారని ఎదురు చూశారు. ఎల్ ని నో ఈ ఏడాది పంటలపై తీవ్ర ప్రభావం చూపనుంది. నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు లో సుమారు ఆరు లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 532 అడుగుల నీరు మాత్రమే ఉంది. ఎగువ నుండి నీరు రాకపోవటం సరైన వర్షాలు లేకపోవడంతో సాగునీటి రైతుల ఆందోళన మొదలైంది. ఆయకట్టులో పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతులు నిరుత్సాహంతో ఉన్నారు. గత ఏడాది పుష్కలంగా సాగునీరు రావడంతో రెండు పంటలు సాగుచేసిన రైతులు సెప్టెంబర్ మాసం ముగుస్తున్న కుడి కాలువ ద్వారా నీరు రాకపోవటంతో సన్నద్ధంలో పడ్డారు. ఆగస్టు 26వ తేదీన త్రాగునీటి అవసరాల కోసం జలవనరుల శాఖ అధికారులు 8 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆయకట్టులోని చెరువులు, కుంటలు నీటితో నింపారు. సకాలంలో వర్షాలు పడతాయన్న ఆశతో రైతులు ఈ ఏడాది భూములను ముందుగానే సేద్యం చేశారు. మండలంలోని గ్రామాలలో బోర్ల కింద వరి నాళ్ళు సిద్ధం చేసుకున్నారు. కారంపూడి మండలంలో 10 వేల హెక్టార్ల సాగు భూమి ఉండగా 2300 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. 1000 హెక్టార్లలో మిర్చి పంటను ప్రస్తుతం సాగు చేయగా బుడ్డ సెనగ, కంది పంటలు సాగు చేయటానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. 70 శాతం వరి పంటలు, మొక్కజొన్న తగ్గే అవకాశం ఉంది. రైతులు పంటలు సాగు చేసేందుకు బోర్లపై ఆధరపడ్డారు . ఎల్ ని నో ప్రభావంతో నియోజకవర్గంలో సగటున 29 శాతానికి లోపే వర్షపాతం నమోదయింది . బోర్ల నుండి కూడా నీరు అంద దనే సందేహం వ్యక్తమౌతుంది .



**కౌలు రైతు పరిస్థితి దయనీయం**

వర్షాలు పడకపోవడం, పంటల సాగు చేయలేని పరిస్థితులు కౌలు రైతుల్లో నెలకొంది. ముందస్తుగా కౌలు చెల్లించిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . పంటలు సాగు చేయకపోతే చెల్లించిన కౌలు మొత్తం నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

**కంది సాగుపై రైతుల ఆశలు**

ఏడాది సాగునీరు లేకపోవటంతో మండలంలో కంది పంట సాగుపై రైతుల ఆశలు ఎక్కువగా ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పొట్ల. నరసింహారావు తెలిపారు . సాగునీరు లేకపోవటంతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేయలేదని ఆ పంటలకు సాగునీరు అవసరమని అన్నారు. కొన్ని గ్రామాలలో బుడ్డ సెనగ సాగుకు రైతులు మొగ్గ చూపుతున్నారని అన్నారు.

**ఎగువ నుండి నీరు వస్తే సాగునీరు అందిస్తాం**

**జల వనరుల శాఖ ఏ ఈ : రామయ్య**

ఎల్ ని నో ప్రభావంతో సరైన వర్షాలు లేవని, ఎగువ నుండి సాగర్ జలాశయానికి నీరు వస్తే కుడి కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. జలాశయంలో నీటిమట్టం కూడా గరిష్టంగా తగ్గిందని అన్నారు.

# మాదకద్రవ్యాలపై సామాజిక చైతన్యమే లక్ష్యం

### డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### యువతకు అవగాహనతో పాటు కౌన్సెలింగ్ అవసరం - ఐజీ ఆకే రవికృష్ణ




గుంటూరు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌పై అవగాహన పెంచుకుని మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఈగల్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో "మత్తు పదార్థాలు - అనర్థాలు" అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వ్యసనం నుంచి కాపాడేందుకు కౌన్సెలింగ్, పునరావాసంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెడు స్నేహాలు, సామాజిక మాధ్యమాల ద్వారా అపరిచితుల పరిచయాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుటుంబం, గ్రామం లేదా పరిసరాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1972కు ఫోన్ చేసి తెలియజేయాలని, ఈగల్ విభాగం అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత కీలక భాగస్వాములు కావాలని అన్నారు. రాష్ట్రంలోని కళాశాలల్లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన తరగతులు నిర్వహించడంతో పాటు యువతను రక్తదానానికి ప్రోత్సహించేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు మాట్లాడుతూ ప్రత్యేక వైద్యుల బృందంతో అన్ని జిల్లాల్లో మత్తు పదార్థాలకు బానిసైన వారికి కౌన్సెలింగ్ అందిస్తామని తెలిపారు. యూత్ రెడ్ క్రాస్ విభాగాల ద్వారా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఐజీ ఆకే రవికృష్ణ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని, మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్లు, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మేడూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆధునిక సాంకేతికతతో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలి

### బయోఫ్లాక్, ఆర్ఏఎస్ విధానాలను ప్రోత్సహించాలి

### యువత, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచాలి -కలెక్టర్ కృతిక శుక్లా




నరసరావుపేట, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): బయోఫ్లాక్, ఆర్ఏఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపల పెంపకాన్ని ప్రోత్సహించి నిరుద్యోగ యువత, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. గత ఏడాది కేటాయించిన రూ.50 లక్షల బడ్జెట్‌కు సంబంధించి రెండు బయోఫ్లాక్ పాండ్లు, రెండు ఇన్సులేటెడ్ వాహనాలు, ఒక లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్ తదితర యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పీఎంఎంఎస్‌వై కింద నిర్దేశించిన ఆర్థిక లక్ష్యాలను నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కోల్డ్ స్టోరేజీలు, ఐస్ ప్లాంట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, సింటెక్స్ బాక్సులు, చేపల రిటైల్ మార్కెట్లు, చేపల రవాణాకు ప్రత్యేక త్రిచక్ర వాహనాలు, జలాశయాల్లో చేప పిల్లల విడుదల, ఫిష్ కియోస్కుల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి. ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, ఎన్ఎస్‌పీ ఈఈ ఈ. శ్రీనివాసరావు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం..!

### సమాజంలోని అసమానతలపై తన కవిత్వంతో పోరాటం

### యువత జాషువా రచనల నుంచి స్ఫూర్తి పొందాలి

### ఘనంగా 131వ జయంతి వేడుకలు



మాచర్ల, సెప్టెంబర్ 28 (మహి న్యూస్): నవయుగ కవి చక్రవర్తి మహాకవి గుర్రం జాషువా సాహిత్య, సామాజిక సేవలు చిరస్మరణీయమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా సోమవారం మాచర్ల పట్టణంలోని జాషువా విగ్రహానికి దళిత ప్రజా సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ.. జాషువా తన రచనలు, కవిత్వం ద్వారా తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. సమాజంలోని అంటరానితనం, అస్పృశ్యత, కులవివక్షకు వ్యతిరేకంగా తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన సామాజిక చైతన్యవేత్తగా జాషువా నిలిచారని కొనియాడారు. తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన జాషువా ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ జాషువా జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించడం గర్వంగా ఉందన్నారు. జాషువా వంటి మహాకవులను స్మరించుకుంటూ సమాజంలోని అంటరానితనం, వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీసీ నవ చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి ఈశ్వరయ్య మాట్లాడుతూ జాషువాను స్మరించుకోవడం సంతోషంగా ఉందని, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి

### 43 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీలకు దక్కని అవకాశం




**మాచర్ల, సెప్టెంబర్ 28 (మహి న్యూస్): మాచర్ల మున్సిపాలిటీ 1983లో ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు మున్సిపల్ చైర్మన్ పదవికి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కేటగిరీ అమలు కాలేదని పలువురు పేర్కొన్నారు. గత 43 సంవత్సరాలుగా వివిధ వర్గాలకు చెందిన వారు ఈ పదవిని చేపట్టారని, అయితే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశం దక్కలేదని తెలిపారు. మాచర్లలో మాల, మాదిగ వర్గాలకు చెందిన ఓట్లు గణనీయంగా ఉన్నాయని, సుమారు 13 వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు చైర్మన్ పదవిలో ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమకు అనుకూలమైన వర్గాలకు పదవులు కేటాయిస్తూ వస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎస్సీ వర్గాల జనాభా, ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని జనాభా దామాషా ప్రకారం మున్సిపల్ చైర్మన్ పదవిని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని కోరుతున్నారు. సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఎస్సీ వర్గాల్లో ఆనందం నెలకొంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.**

## భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి....

### భగత్ సింగ్ ఆశయాల కోసం ఉద్యమిద్దాం.....



తిరుపతి , సెప్టెంబర్ 28 మహి న్యూస్: డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా యువత పెద్దఎత్తున ఉద్యమించాలని డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. జయచంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఎం. వీరేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతి



సందర్భంగా ఎంజీఎం ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహానికి ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమాద్రి మరియు టీచర్స్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ చేసిన పోరాటం, ఆయన త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భగత్‌సింగ్ జయంతిని కేవలం ఉత్సవంగా కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే రోజుగా జరుపుకోవాలని సూచించారు. భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించారు; 2026లో ఆయన 119వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నివాళులు అర్పిస్తున్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. భగత్‌సింగ్ చూపిన ధైర్యం, దేశభక్తి, త్యాగస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. "డ్రగ్స్‌కు నో చెప్పి, దేశ నిర్మాణానికి చేయూతనిద్దాం" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినివిద్యార్థులు, డివైఎఫ్ఐ నాయకులు అజయ్ కుమార్ సిఐటియు నాయకులు మహేష్ రమేష్ యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## పర్యాటకాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత

### ప్రజలు, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 28 : జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం రెడ్డిగుంట నందు "రామోజీ ఫౌండేషన్" ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో రెడ్డిగుంట చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ (చిత్తూరు), మురళీమోహన్ (పూతలపట్టు), పులివర్తి నాని (చంద్రగిరి), చూడ చైర్‌పర్సన్ కట్టా కటారి హేమలత, ప్రముఖ పారిశ్రామికవేత్త శైలజ తదితరులు పాల్గొన్నారు. అక్కడ జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను సంరక్షించడంతో పాటు వాటి పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎస్ఆర్, పి4 మరియు కమ్యూనిటీ పార్టిసిపేషన్‌ను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. చెరువుల అభివృద్ధి, రక్షణతో పాటు చెరువుల చుట్టుపక్కల ప్రజలకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే మంచి ఆలోచన ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ వనరులకు ప్రజల అవసరాలు, అంచనాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ రంగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. చెరువులను ఏ విధంగా అభివృద్ధి చేయాలి, వాటిని ఎలా సంరక్షించాలి, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అనే అంశాలపై ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. వచ్చే రెండు మూడు నెలల్లో చెరువుల అభివృద్ధికి స్పష్టమైన రూపురేఖలు తీసుకురావడంతో పాటు సంరక్షణ చర్యలను కూడా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం కూడా భాగస్వామిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. రక్తదాన కేంద్రాలు, సీఎస్ఆర్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి తదితర ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో ప్రైవేట్ సంస్థలు, దాతలు, కమ్యూనిటీ సంస్థలు ముందుకు వస్తే ప్రజల అవసరాలను మరింత వేగంగా తీర్చేందుకు వీలవుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన మంచి ఆలోచనలు, కార్యక్రమాలతో ముందుకు వచ్చే సంస్థలు, వ్యక్తులు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని, అటువంటి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, చెరువుల సంరక్షణ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వ--ప్రైవేట్--ప్రజల భాగస్వామ్యంతో సమన్వయపూర్వకంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఆముద, సి.కి. లావణ్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో 'ప్రపంచ రేబీస్ దినోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 28 : ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు మరియు జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నరసింహులు "ప్రపంచ రేబీస్ దినోత్సవం - 2026" పోస్టర్ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంఅండ్హెచ్ఓ) డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ పి. జితేంద్ర, ఇతర వైద్యులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. "కలిసి ఉంటే మరింత బలం" అనే నినాదంతో రేబీస్ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కుక్క కాటుకు గురైనప్పుడు వెంటనే తగిన వైద్య సహాయం పొందడం ద్వారా రేబీస్ బారిన పడకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు.

# శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల తరహాలోనే నవరాత్రి బ్రహ్మోత్సవాలను మరింత విజయవంతం చేయాలి

### బ్రహ్మోత్సవాలలో టీటీడీ ఏర్పాట్లపై 95% పైగా సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు

### టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి

తిరుమల , సెప్టెంబర్ 28, మహి న్యూస్ : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని నవరాత్రి బ్రహ్మోత్సవాలను మరింత విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, ఈ ఏడాది అధికమాసం కారణంగా రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని, సాలకట్ల బ్రహ్మోత్సవాలు పూర్తయిన నేపథ్యంలో కేవలం 17 రోజుల వ్యవధిలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో వివిధ విభాగాల పనితీరుపై సేకరించిన ఫీడ్‌బ్యాక్, చెక్‌లిస్ట్‌లను విభాగాల వారీగా సమీక్షించి, ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దడంతోపాటు మరింత మెరుగైన సమన్వయం కోసం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో అన్నప్రసాదం, విద్యుత్ అలంకరణ, పుష్పాలంకరణతోపాటు పలు విభాగాల్లో 95 నుంచి 98 శాతం వరకు సంతృప్తి వ్యక్తమైనట్లు తెలిపారు. ఇదే అనుభవంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పూర్తిస్థాయిలో సెలవులు ఉండటం వల్ల గత బ్రహ్మోత్సవాలతో పోలిస్తే మరింత మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల భక్తుల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని అదనంగా సుమారు 20 శాతం భక్తుల రాకను అంచనా వేస్తూ అన్నప్రసాదం, అవసరమైన సామగ్రి, ప్రొక్యూర్‌మెంట్, స్టాకింగ్, రవాణా, లాజిస్టిక్స్ తదితర అంశాల్లో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

#### సామాన్య భక్తులకు ప్రాధాన్యం

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ దర్శన సమయాలను తగ్గించేందుకు చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని అదనపు ఈవో తెలిపారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజులలో రోజుకు సగటున సుమారు 73 వేల మంది భక్తులు మూలమూర్తి దర్శనం చేసుకున్నారని,



అయినప్పటికీ సరైన ప్రణాళికతో దర్శనానికి వేచి ఉండే సమయాన్ని చాలా వరకు తగ్గించగలిగామని చెప్పారు. సాధారణంగా 5 నుంచి 8 గంటలు, గరిష్టంగా 10 గంటలలోపు దర్శనం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సామాన్య భక్తుల సర్వదర్శనానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు వీఐపీ, ప్రివిలేజ్ దర్శనాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న పిల్లలు, శ్రీవాణి, ఎస్ఈడీ తదితర దర్శనాల విషయంలో అవసరమైన నియంత్రణలు చేపట్టినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి కొన్ని దర్శనాలను తగ్గించడం లేదా రద్దు చేయడం ద్వారా సర్వదర్శన భక్తులకు వేచి ఉండే సమయాన్ని తగ్గించే విధానాన్ని నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ కొనసాగించనున్నట్లు చెప్పారు. మూలమూర్తి దర్శనంతోపాటు వాహనసేవలను కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వీక్షించే అవకాశం కల్పించేందుకు రెండింటినీ సమన్వయం చేస్తూ మ్యాన్‌పవర్, ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

#### భద్రత, వర్షాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా పోలీసు యంత్రాంగంతో మరోసారి సమన్వయ సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ విజిలెన్స్ విభాగం ద్వారా ఊరేగింపులు, వాహనసేవల నిర్వహణను మరింత క్రమబద్ధీకరించి, నిర్ణీత టైమ్‌లైన్ ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చోట్ల ఎన్‌డీఆర్ఎఫ్ సేవలను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అక్టోబర్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వర్షాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా సమగ్ర ప్రణాళికలో చేర్చినట్లు తెలిపారు.

#### ఎస్వీబీసీ ప్రసారాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్ష

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలతోపాటు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాదనీరాజనం కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా విభాగాల అధికారులతో అంశాల వారీగా చర్చించినట్లు తెలిపారు. ప్రతి విభాగం తమ అవసరాలు, సమస్యలు, గత బ్రహ్మోత్సవాల అనుభవాలు, తదుపరి ఉత్సవాల్లో చేయాల్సిన మెరుగుదలలను సమావేశంలో వివరించిందని, వాటిపై చర్చించి సమన్వయంతో పనిచేసేలా ఏకాభిప్రాయం సాధించినట్లు చెప్పారు.

#### భక్తులు టీటీడీ సమాచారాన్ని అనుసరించాలి

తిరుమలలో భక్తుల సంఖ్య, వాహనాల రాక, పార్కింగ్, అన్నప్రసాదం, భద్రత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని టీటీడీ ఎప్పటికప్పుడు అధికారిక సమాచారాన్ని విడుదల చేస్తుందని అదనపు ఈవో తెలిపారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ తదితర అధికారిక



వేదికల ద్వారా అందించే సమాచారాన్ని భక్తులు తప్పనిసరిగా అనుసరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారిక సమాచారానికి అనుగుణంగా భక్తులు తమ ప్రయాణాన్ని, దర్శన ప్రణాళికను రూపొందించుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రత, ఆధ్యాత్మిక వాతావరణానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని విభాగాలు టీమ్‌వర్క్‌తో పనిచేసి నవరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీలోని వివిధ విభాగాల అధికారులు, పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

గచిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 28: బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ శ్రీ వెటుకూరి ఏ.వి.ఎస్. సూర్య నారాయణ రాజు అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లాలో పర్యటించిన ఆయనకు అధికారులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో స్వాగతం పలికారు. అనంతరం గిరింపేటలోని ఎంసీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి.వి. పద్మలతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి బాలుడికి జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ హక్కు, భాగస్వామ్య హక్కులు ఉన్నాయని తెలిపారు. పిల్లలకు అవసరమైన విద్య, పౌష్టికాహారం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు అందుతున్నాయా లేదా పరిశీలించడం కూడా కమిషన్ బాధ్యతల్లో భాగమని చెప్పారు. ప్రభుత్వాలు బాలల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వాటి ద్వారా అందుతున్న ప్రతి సదుపాయం బాలలకు సక్రమంగా చేరుతున్నదా లేదా పరిశీలించేందుకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని వివరించారు. బాలలు పాఠశాలల్లో సురక్షిత వాతావరణంలో విద్యనభ్యసించేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ శాఖలతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. బాలల రక్షణలో భాగంగా గుడ్ టచ్--బ్యాడ్ టచ్పై ప్రతి బాలుడు, బాలిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలలపై లైంగిక వేధింపులు లేదా ఇతర హక్కుల ఉల్లంఘనలు జరిగితే పోక్సో చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలలోగానీ, సమాజంలోగానీ బాలల హక్కులకు భంగం కలిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. బాలలు 18 సంవత్సరాల వయస్సు వరకు బాలల పరిధిలోకి వస్తారని, ఈ కాలంలో వారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధికి అవసరమైన అన్ని అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ద్వారా పిల్లలు విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి బాలుడు బాగా చదువుకుని తన కాళ్లపై తాను నిలబడే స్థాయికి ఎదగాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు.

పిల్లలు అభివృద్ధి చెందితే తల్లిదండ్రులతో పాటు సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని, చదువు మధ్యలో నిలిపివేసి బాల్య వివాహాలకు ప్రోత్సహించకూడదని సూచించారు. 18 సంవత్సరాల వయస్సు నిండకముందు బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని, బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి.వి. పద్మలత మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, బాలల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, మండల విద్యాశాఖ అధికారి, మిషన్ వాత్సల్య ఇన్‌చార్జి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు జగదీశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

### పీజీఆర్ఎస్ వేదికలో 434 వినతులు స్వీకరణ

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 28 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్ -- పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, సంబంధిత ఆర్డీవోలతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 434 వినతులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో అత్యధికంగా 363 వినతులు రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవే కావడం గమనార్హమన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచడానికి వీలు లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు కిందిస్థాయి నుంచి మానిటర్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలను ఆయా శాఖల పరిధిలో వెంటనే పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులతో మానిటర్ చేస్తూ పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఐవిఆర్ఎస్ ఫీడ్బ్యాక్‌కు సంబంధించి పాజిటివ్ పబ్లిక్ పర్ఫెక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యతిరేకతను తగ్గించాలని ఆదేశించారు.

#### శాఖల వారీగా వచ్చిన వినతులు:

రెవెన్యూ, సర్వే శాఖకు 363, పోలీస్ శాఖకు 6, పంచాయతీ రాజ్ శాఖకు 8, డీఆర్‌డీఏకు 13, ఇరిగేషన్ శాఖకు 2, దేవదాయ శాఖకు 2, వ్యవసాయ శాఖకు 4, ఉద్యాన శాఖకు 5, రోడ్లు మరియు భవనాల శాఖకు 2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు 6, హౌసింగ్ శాఖకు 2, ఏపీఎస్‌పీడీసీఎల్‌కు 2, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ శాఖకు 3, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డుకు 2, ఏపీఎస్ఆర్టీసీకి 3, సివిల్ సప్లైస్ శాఖకు 3, పశుసంవర్ధక శాఖకు 1, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖకు 1, ఎస్సీ కార్పొరేషన్‌కు 1, అటవీ శాఖకు 1, మైన్స్ అండ్ జియాలజీ శాఖకు 1, ఎల్‌డీఎంకు 1, గురుకులంకు 1, నేషనల్ హైవే శాఖకు 1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు 1, రూరల్ వాటర్ సప్లై ఇంజినీరింగ్ శాఖకు 1 చొప్పున మొత్తం 434 వినతులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, డిపిఎం మధుసూదన్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ యు. పుల్లారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకట సునీల్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సూదలగుంట షుగర్స్ రైతుల బకాయిల చెల్లింపుపై సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 28: సూదలగుంట షుగర్స్ యూనిట్--1 శ్రీకాళహస్తి, యూనిట్--2 పొదలకూరు పరిధిలో చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను నవంబర్ 30లోగా రెండు విడతల్లో చెల్లించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ మినీ విసి హాల్ నందు సూదలగుంట షుగర్స్ యూనిట్--1 శ్రీకాళహస్తి, యూనిట్--2 పొదలకూరు పరిధిలో చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, నెల్లూరు అసిస్టెంట్ కేన్ కమీషనర్ జాన్ విక్టర్, సూదలగుంట కెన్ షుగర్ ఫ్యాక్టరీ యజమాని జయరాం చౌదరి లతో కలసి రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మౌఖిక హామీలతో కాకుండా బకాయిల చెల్లింపునకు సంబంధించిన పూర్తి ప్రణాళికను లిఖితపూర్వకంగా సమర్పించాలని స్పష్టం చేశారు. మొత్తం బకాయిలను ఎన్ని విడతల్లో, ఏ తేదీల్లో, ఏ మొత్తంలో చెల్లిస్తారో స్పష్టంగా పేర్కొంటూ రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు. నోటరైజ్డ్ అఫిడవిట్‌లో 60 రోజుల్లోగా మొత్తం బకాయిల చెల్లింపు పూర్తి చేస్తామని స్పష్టంగా పేర్కొనాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అఫిడవిట్‌తో పాటు యూనిట్--1, యూనిట్--2 వారీగా, రైతులు, హార్వెస్టింగ్ కార్మికులు, ఇతర బకాయిదారులకు చెల్లించాల్సిన మొత్తాల పూర్తి వివరాలను సమర్పించాలని సూచించారు. యూనిట్‌ల వారీగా రైతులకు, హార్వెస్టింగ్ కార్మికులకు, ఇతర వర్గాలకు చెల్లించాల్సిన బకాయిల పూర్తి వివరాలను అధికారులు, యాజమాన్య ప్రతినిధుల నుంచి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తాలను స్పష్టంగా విభజించి, ఏ యూనిట్‌కు ఎంత బకాయి ఉంది, రైతులకు ఎంత, హార్వెస్టింగ్ కార్మికులకు ఎంత, ఇతర బకాయిలు ఎంత ఉన్నాయనే వివరాలతో కూడిన అధికారిక నివేదికను సమర్పించాలని సూచించారు. రైతులకు తమ బకాయిలు అందడం అత్యంత ప్రధానమని, యాజమాన్యం ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆస్తుల సంబంధిత సమస్యల కంటే రైతుల బకాయిల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు అవసరమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నవంబర్ 30, 2026ను తుది గడువుగా పరిగణించి, ఆ తేదీలోగా రెండు విడతల చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 31లోపు తొలి విడత చెల్లింపునకు అవకాశం ఉంటే వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సూచించారు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతులు ఇప్పటికే దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నందున ఇకపై బకాయిల చెల్లింపులో జాప్యం లేకుండా లిఖితపూర్వక హామీలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలోగా రోడ్‌మ్యాప్, పూర్తి బకాయిల వివరాలతో కూడిన అధికారిక లేఖను, నిర్ణీత గడువులో నోటరైజ్డ్ అఫిడవిట్‌ను సమర్పించాలని జిల్లా కలెక్టర్ యాజమాన్యానికి స్పష్టం చేశారు. రైతుల బకాయిల చెల్లింపు పురోగతిని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సూదలగుంట షుగర్ ఫ్యాక్టరీ యజమాని మాట్లాడుతూ, యాజమాన్య ప్రతినిధులు తమ ప్రయత్నాల మేరకు రైతుల బకాయిలను రెండు విడతల్లో చెల్లించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. తొలి విడతగా రూ.15 కోట్లు, రెండో విడతగా మరో రూ.15 కోట్లు చెల్లించే అవకాశాలను పరిశీలిస్తున్నామని, అవసరమైన నిధుల సమీకరణపై చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా, అక్టోబర్ చివరి నాటికే చెల్లింపులు చేస్తామని తెలిపారు. అదేవిధంగా, నవంబర్ 30 2026 (నిర్ణీత 60 రోజుల) వ్యవధిలో బకాయిలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడితే, నెల్లూరులోని 50 ఎకరాల భూమి, శ్రీకాళహస్తిలో బ్యాంకు అటాచ్‌మెంట్లు లేని భూమిని విక్రయించి, ఆ మొత్తాన్ని బకాయిల చెల్లింపునకు వినియోగిస్తామని యాజమాన్య ప్రతినిధులు సమావేశంలో అంగీకరించారు. పొదలకూరు షుగర్ ప్లాంట్‌ను విక్రయించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ప్లాంట్ యంత్రాలు, భూమికి సంబంధించి కొనుగోలుదారులతో చర్చలు జరుగుతున్నాయని, బ్యాంకు అనుమతులు, ఇతర ప్రక్రియలు పూర్తయిన అనంతరం విక్రయం ద్వారా నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ప్లాంట్ విక్రయం ద్వారా వచ్చే నిధుల్లో ముందుగా రైతుల బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే బ్యాంకుకు రూ.2 కోట్ల అడ్వాన్స్ చెల్లించినట్లు కూడా యాజమాన్య ప్రతినిధులు సమావేశంలో వెల్లడించారు. తదుపరి ప్రక్రియలో బ్యాంకు నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ బకాయిల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని యాజమాన్యంతో సమావేశం నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పి. రవి మనోహరా చారి, రైతులు, పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com

# ఎయిడ్స్‌పై యువత భాగస్వామ్యంతో విస్తృత అవగాహన

## మారథాన్ విజేతలకు నగదు బహుమతుల చెక్కులు అందజేసిన కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ఎయిడ్స్ వ్యాధి నివారణ, నియంత్రణపై విద్యార్థులు, యువతతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యం, క్రమశిక్షణ, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై యువతలో చైతన్యం పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం సునయన ఆడిటోరియంలో కలెక్టర్ నగదు బహుమతుల చెక్కులను అందజేసి అభినందించారు. మారథాన్‌లో సుమారు 87 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని కలెక్టర్ తెలిపారు. ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించడంతో పాటు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమన్నారు. పురుషుల విభాగంలో బషీర్ ప్రథమ, వెంకట భరత్ ద్వితీయ బహుమతులు సాధించగా.. మహిళల విభాగంలో వెంకటేశ్వరి ప్రథమ, రామలక్ష్మి ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతి విజేతలకు రూ.10 వేల చొప్పున, ద్వితీయ బహుమతి విజేతలకు రూ.7 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఎయిడ్స్ నివారణ, నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను భాగస్వాములను చేస్తూ ఎయిడ్స్ అవగాహన, ఆరోగ్య పరిరక్షణ, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై మరిన్ని కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ భాస్కర్, డీఎస్‌డీవో భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదులపై చట్టపరంగా న్యాయం చేస్తాం

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 128 ఫిర్యాదులు

## కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూలు కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 128 ఫిర్యాదులు అందాయి.

### ఫిర్యాదుల్లో కొన్ని...

పోస్టల్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ముగ్గురి వద్ద నుంచి రూ.18 లక్షలు తీసుకుని మోసం చేశారని, సంపంగి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని దిన్నదేవరపాడుకు చెందిన వెంకట సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో నకిలీ గుర్తింపు కార్డులు, ఇంటర్వ్యూ లేఖలు ఇచ్చి రూ.4



లక్షలు తీసుకుని మోసం చేశారని, కడప జిల్లాకు చెందిన మహిళపై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలానికి చెందిన రవితేజ, జయచంద్ర ఫిర్యాదు చేశారు. - 2021లో మరణించిన తన తండ్రి 2024లో మాట్లాడినట్లు, నోటీసులు ఇచ్చినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి, తనకు తెలియకుండా రూ.12 లక్షల విలువైన 2 ఎకరాల 30 సెంట్ల భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేశారని, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఉయ్యాలవాడకు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఆస్పరిలోని శాంతా హెల్పింగ్ మిషన్ అనాథాశ్రమానికి వివిధ కంపెనీల నుంచి రూ.30--40 లక్షల వరకు నిధులు ఇప్పిస్తామని నమ్మించి, తమ వద్ద రూ.8 లక్షలు తీసుకుని మోసం చేశారని కదిరికి చెందిన మంజునాథ్‌పై చర్యలు తీసుకోవాలని ముత్తకూరు గ్రామానికి చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు ఖాళీ స్థలం ఉన్నప్పటికీ మరుగుదొడ్డి నిర్మించుకోకుండా అడ్డుకుంటూ గొడవలు సృష్టిస్తున్న పక్కింటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పెద్దకడబూరు మండలం మురవణి గ్రామానికి చెందిన పద్మ ఫిర్యాదు చేశారు. అవసరం ఉండి రూ.45 వేలు అప్పుగా తీసుకుని, పూచీకత్తుగా ఇచ్చిన ఐదు తులాల బంగారాన్ని తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు చిదంబరరావు వీధికి చెందిన అనురాధ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం



విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, మస్తాన్ వలి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

## పీజీఆర్‌ఎస్‌లో 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులు పూర్తిగా తగ్గాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీని సత్వరం పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులకు అందించే పరిష్కార పత్రాలు స్పష్టంగా, పూర్తి వివరాలతో ఉండాలని ఆదేశించారు. పరిష్కరించడం సాధ్యం కాని సమస్యల విషయంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో నమోదవుతున్న 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులను పూర్తిగా తగ్గించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఒకసారి పరిష్కరించిన అర్జీ మళ్లీ రీ-ఓపెన్ కాకుండా సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. నిబంధనల పరిధిలో సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, రామ సుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రూ.4,200 కోట్లతో కర్నూలులో హార్టికల్చర్ హబ్

## రైతులు, ప్రజల్లో విస్తృత అవగాహనకు కార్యాచరణ

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో రూ.4,200 కోట్లతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఈ కార్యక్రమంపై రైతులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం హార్టికల్చర్ హబ్, రెవెన్యూ, అక్షరాంధ్ర, స్వచ్ఛతా హీ సేవా తదితర అంశాలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.లక్ష కోట్లతో చేపట్టనున్న హార్టికల్చర్ హబ్ కార్యక్రమాల రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవం అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లాలో జరగనున్న నేపథ్యంలో కర్నూలు జిల్లాలో కూడా విస్తృతంగా ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'నా జిల్లా--నా పంట' కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు పాఠశాలల్లో డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. 'గెస్ ది క్రాప్' కార్యక్రమంలో విద్యార్థులతో పంటలను గుర్తించే పోటీలు నిర్వహించాలని, 'ఒక మొక్క--భవిష్యత్తు కోసం' కార్యక్రమంలో మొక్కలు నాటించి విద్యార్థులతో వాటిని దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబర్ 29న 'తోట పాఠశాల' కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ నీటిపారుదల, ఫామ్ పాండ్స్‌పై క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించాలని ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రచార రథాలు, కళాజాతా, బుర్రకథ తదితర సంప్రదాయ కళారూపాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సెప్టెంబర్ 30న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్టోబర్ 1న కూరగాయలు, పూలు తదితర ఉద్యాన ఉత్పత్తులతో ముగ్గుల పోటీలు నిర్వహించాలని డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలను



ముద్రణ, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, జిల్లాలో హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. 'నా తోట కథ'లో భాగంగా రైతుల విజయగాథలు, రైతుల అనుభవాలను ప్రచారం చేయడంతో పాటు స్థానిక సామాజిక మాధ్యమాల సృష్టికర్తలు, ఇన్‌ఫ్లుయెన్సర్లతో 'బెస్ట్ రీల్స్' పోటీ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంతో పాటు అనంతర ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

### పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులకు పూర్తిస్థాయి పరిష్కారం

రెవెన్యూ శాఖకు సంబంధించిన పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులను కేవలం గడువులోగా ముగించడమే లక్ష్యంగా కాకుండా, సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చూపాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు జారీ చేసే ఆర్డర్లు, ఎండార్స్‌మెంట్లను ముందుగా ఆర్డీఓ కార్యాలయంలో పరిశీలించి, ఆమోదం అనంతరం పీజీఆర్‌ఎస్‌లో అప్‌లోడ్ చేసి క్లోజ్ చేయాలని సూచించారు. బ్యాక్‌డేటెడ్ ఎంట్రీలు చేయవద్దని స్పష్టం చేశారు. 22-ఏ భూముల తొలగింపు ప్రతిపాదనలు, ఏపీఐఐసీ భూముల మ్యుటేషన్లు, బల్క్ ఇష్యూస్, హౌస్‌సైట్స్ తదితర పెండింగ్ అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### అక్షరాంధ్ర, స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

అక్షరాంధ్ర కార్యక్రమంలో ఆలూరు, ఎమ్మిగనూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్ ప్రాంతాల్లో తక్కువగా ఉన్న హాజరును వెంటనే మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రతిరోజూ హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా 'స్వచ్ఛతా సే సమృద్ధి', 'సర్క్యులర్ ఎకానమీ', 'వేస్ట్ టు వెల్త్' కార్యక్రమాల వివరాలను ప్రతిరోజూ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 30న పారిశుధ్య కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు, అక్టోబర్ 1న 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్' పేరుతో భారీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా ప్రత్యేక కౌన్సిల్, గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ ఫారాలను త్వరితగతిన పరిష్కరించాలని, 44 గ్రామాల్లో చేపట్టాల్సిన సర్వే పనులకు అక్టోబర్ 1 నుంచి రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకుని పురోగతిని నివేదించాలని ఏడి సర్వేయర్‌ను కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్‌ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆర్డీఓలు ఓబులేసు, సందీప్ కుమార్, అరుణ దేవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రావు, మెప్మా పీడీ శ్రీనివాసులు, డీఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో నీటి నాణ్యతపై పటిష్ఠ పర్యవేక్షణ

## సెప్టెంబర్ 1 నుంచి 26 వరకు 1,917 నీటి నమూనాల పరీక్ష

## అన్ని నమూనాలు తాగునీటికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ

కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు సిటీ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీల్లో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది, నివాసితులకు సురక్షితమైన తాగునీరు అందించేలా దక్షిణ మధ్య రైల్వే అధికారులు నీటి నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని కర్నూలు సిటీ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీల్లో భూగర్భ జల వనరులు, మున్సిపల్ నీటి సరఫరా, నీటి నిల్వ కేంద్రాలు, క్లోరినేషన్ ప్రక్రియ, పంపిణీ వ్యవస్థలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రతిరోజూ అవశేష క్లోరిన్ స్థాయిలను తనిఖీ చేయడంతో పాటు, ఈ-కోలి బ్యాక్టీరియా కలుషితాన్ని గుర్తించేందుకు క్రమం తప్పకుండా బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 26 వరకు మొత్తం 1,917 నీటి నమూనాలను అవశేష క్లోరిన్ స్థాయిల కోసం పరీక్షించగా, అన్ని నమూనాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒక్క నమూనా కూడా తాగడానికి అనర్హంగా ఉన్నట్లు గుర్తించలేదు. అదేవిధంగా 315 నమూనాలను బ్యాక్టీరియాలజికల్ పరీక్షలకు పంపగా, ఏ ఒక్క నమూనా కూడా అసురక్షితంగా తేలలేదు. ఈ-కోలి పాజిటివ్ నమూనా కూడా గుర్తించలేదు. మరో 17 నీటి నమూనాలను రసాయన విశ్లేషణకు పంపగా, అవన్నీ తాగునీటికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. తాగునీటి వనరులు, భూస్థాయి నీటి నిల్వ ట్యాంకులు (జీఎల్ఆర్‌లు), ఎత్తైన నీటి నిల్వ ట్యాంకుల (హెచ్ఎల్ఆర్‌లు) వద్ద ఇంజినీరింగ్, వైద్య విభాగాలు సంయుక్తంగా 94 తనిఖీలు నిర్వహించాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఇండియన్ రైల్వేస్ మెడికల్ మాన్యువల్‌లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులు, రైల్వే నివాసితులకు శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందేలా తరచూ పరీక్షలు, తనిఖీలు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# గుర్రపు డెక్క తొలగింపు ముమ్మరం

## హైడ్రాలిక్ ఎక్స్కవేటర్‌తో తొలగింపు పనులు

## వంతెనల వద్ద పేరుకుపోకుండా చర్యలు

## పనులను పరిశీలించిన కమిషనర్ చల్లా ఓబులేసు




కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగర పరిధిలోని కేసీ కెనాల్‌లో గుర్రపు డెక్క ఒకేచోట పేరుకుపోకుండా తొలగింపు పనులను ముమ్మరం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం వినాయక ఘాట్, జోహరాపురం వంతెన ప్రాంతాల్లో జరుగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. నీటి ప్రవాహంతో కొట్టుకొచ్చే గుర్రపు డెక్క వంతెనల పిల్లర్ల వద్ద పెద్దమొత్తంలో పేరుకుపోకుండా హైడ్రాలిక్ ఎక్స్కవేటర్ సహాయంతో తొలగిస్తున్నట్లు తెలిపారు. కెనాల్‌లో నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా, వంతెనల వద్ద గుర్రపు డెక్క పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగింపు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, వెహికల్ ఇన్‌చార్జి కురుబ మధుబాబు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



# 486 పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ

## అధికారికంగా జాబితాను ప్రదర్శించిన కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నగర పరిధిలో ప్రతిపాదించిన 486 పోలింగ్ కేంద్రాల తుది జాబితాను అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సోమవారం ప్రచురించారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో తుది పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారికంగా ప్రదర్శించారు. నగర పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లోనూ తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు కమిషనర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# బీసీ స్టడీ సర్కిల్‌లో మౌలిక వసతులు కల్పించాలి

## కలెక్టర్‌కు బీసీ సంఘాల నేతల వినతి



కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని కల్లూరులో సుమారు 30 ఏళ్లుగా కొనసాగుతున్న బీసీ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని బీసీ సంఘాల నేతలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరిని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు బీసీ స్టడీ సర్కిల్‌ను వినియోగించుకుంటున్నారని నేతలు తెలిపారు. అయితే ఇక్కడ విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు, స్నానపు గదుల సౌకర్యం కూడా లేకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లు, స్నానపు గదులు, అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టడీ సర్కిల్‌ను ఆధునీకరించి విద్యార్థులకు ఉపయోగపడేలా ఆర్వో ప్లాంట్, రెండు కంప్యూటర్లు, జిరాక్స్ యంత్రం, మైక్, స్పీకర్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ స్టడీ సర్కిల్‌ను మరింత అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు పోటీ పరీక్షల preparationకు మెరుగైన వాతావరణం కల్పించాలని బీసీ సంఘాల నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం. రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెస్త శ్రీనివాసులు, ఎన్టీఆర్ సన్న, గిడ్డయ్య, ఉపరి శివన్న, బెస్త వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

## కమిషనర్ చల్లా ఓబులేసు

## ప్రజా ఫిర్యాదుల వేదికకు 21 అర్జీలు




కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): నగర ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు అందాయి. కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్య ఉన్న ప్రాంతాలను అధికారులు స్వయంగా సందర్శించి పరిశీలిస్తే సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపడం సులభమవుతుందని కమిషనర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, ప్రజల సంతృప్తిని పెంచేలా పనిచేయాలని సూచించారు. అందిన 21 అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, ఎస్ఈ రమణమూర్తి, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్‌ఎస్ దరఖాస్తులకు వేగంగా పరిష్కారం

## 299 దరఖాస్తులు పరిశీలన

## 135 దరఖాస్తులు అధికారుల లాగిన్‌లో పెండింగ్

## రీ-ఓపెన్ చేసిన 13 దరఖాస్తులపై చర్యలు



నంద్యాల, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని అధికారులను జిల్లా అధికారులు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ సమీక్షలో 299 దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో 135 దరఖాస్తులు అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉండగా, రీ-ఓపెన్ చేసిన 13 దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో 158 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



## 11 వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరసన కార్యక్రమం



గాలివీడు:సెప్టెంబర్28(మహి న్యూస్ ): రాష్ట్ర వీఆర్ఏ జేఏసీ సంఘం పిలుపు మేరకు గాలివీడు మండల గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం సోమవారం 11వ రోజుకు చేరుకుంది. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద వీఆర్ఏలు తమ సమస్యల పరిష్కారం కోసం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోరాన్ చెరువు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బి. రాజారెడ్డి నిరసన శిబిరాన్ని సందర్శించి వీఆర్ఏలకు సంఘీభావం తెలిపారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు.వీఆర్ఏలు తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## గాలివీడులో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



గాలివీడు:సెప్టెంబర్28(మహి న్యూస్): మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఈ నెల 30, అక్టోబర్ 1 తేదీల్లో నిర్వహించనున్నట్లు గాలివీడు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సి. గంగరాజు తెలిపారు. గాలివీడు బాయ్స్ హైస్కూల్ వేదికగా రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.ఈ పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో-ఖో, చెస్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొననున్నారు.గాలివీడు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కోరారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు దోహద పడతాయని ఆయన పేర్కొన్నారు.

## రైతులకు, వినియోగదారులకు మరింత చేరువగా రైతు బజార్లు

### సెప్టెంబర్ 30న పుంగనూరు, పీలేరులో నూతన రైతు బజార్ల ప్రారంభం



మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 28: రైతులకు తమ పంట ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నూతన రైతు బజార్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి. త్యాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో కొత్త రైతు బజార్ల ఏర్పాటులో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీన పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రాంగణంలో ఉదయం 9:00 గంటలకు, అలాగే పీలేరులో సాయంత్రం 4:00 గంటలకు నూతన రైతు బజార్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి, రైతులకు మెరుగైన ధర లభించేలా రైతు బజార్లు దోహదపడతాయని పేర్కొన్నారు. అదే విధంగా వినియోగదారులకు తాజా వ్యవసాయ ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించేలా రైతు బజార్లు ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలో రైతుల మార్కెటింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని ఆ ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

## మంత్రికి ఏబీవీపీ వినతిపత్రం



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 28: రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్,ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)రాయచోటి శాఖ ఆధ్వర్యంలో రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ అభిలాష్, అన్నమయ్య జిల్లా కన్వీనర్ సన్నా మనోజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు ?6,800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా పీజీ విద్యార్థులకు సంబంధించిన జీఓ నెం.77పై ప్రభుత్వం పునఃపరిశీలించి జీఓ నెం.77 ను రద్దు చేయాలని వారు కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల విషయంలో విద్యార్థులపై ఒత్తిడి లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మంత్రి చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరపున విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

## పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో

## కామ్రేడ్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు




కడప, మహిన్యూస్, సెప్టెంబర్ 28: కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయ ఆవరణంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ కామ్రేడ్ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అనాలోచిత నిర్ణయాల కారణంగా యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ ప్రయోజనాలకు అనుగుణంగా పాలక ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్య ప్రజలు, విద్యార్థులు, యువత ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, దేశంలో జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు, యువత ప్రశ్నించే గొంతుకలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చేందుకు యువత ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా యువజన నాయకుడు పృథ్వీ, ముస్తాఫ్, సమీవుల్లా, కిషోర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ సమస్యలను జాప్యం లేకుండా నాణ్యత పరిష్కరించాలి

### జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

మదనపల్లి, మహి న్యూస్ సెప్టెంబర్ 28 : పిజిఆర్ఎస్ సమస్యలను జాప్యం లేకుండా నాణ్యత ప్రామాణికంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార



వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తోపాటు డిఆర్ఓ వెంకటేష్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ ఎన్ ఎస్ ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి,సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి



ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.



### ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..

1) మదనపల్లి పట్టణంలోని నక్కల దీన్నే తాండకు చెందిన మూడే నాగరాజు నాయక్ తాను పేద కుటుంబానికి చెందినవారినని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, కుటుంబ పోషణ భారంగా మారిందని తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. 2)గుర్రంకొండ మండలం టి.రాచపల్లె గ్రామానికి చెందిన ఎం.చెన్నక్రిష్ట రెడ్డి నాకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమికి రైతుభరోసా (అన్నదాత సుఖీభవ) పథకం నిధులు అందడం లేదని,తమరు భూమి వివరాలను పరిశీలించి, రైతుభరోసా పథకం కింద ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. 3) కలకడ మండలం కదిరాయ చెరువు కు చెందిన ఆర్. లక్ష్మీదేవి తనకు వివాహమై భర్త వదిలి వేశాడని ఒంటరిగా ఇద్దరు పిల్లలతో జీవించుచున్నానని కుటుంబ పోషణకు ఎలాంటి జీవనాధారం లేదని,తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఒంటరి మహిళా పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 424 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ రేబిస్ దినోత్సవ గోడ ప్రతులను ఆవిష్కరించిన

### - జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

### రేబిస్ నివారణకు సమష్టి కృషి అవసరం

### కుక్క కాటుకు గురైన వెంటనే వైద్య సేవలు పొందాలి




మదనపల్లె, మహి న్యూస్ సెప్టెంబర్ 28: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన ప్రచార సామాగ్రిని సోమవారం పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తో పాటు చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రేబిస్ అత్యంత ప్రాణాంతకమైన జూనోటిక్ వ్యాధి అని, వ్యాధి నివారణలో అవగాహన, సకాలంలో టీకాలు వేయించుకోవడం అత్యంత కీలకమన్నారు. ఈ ఏడాది "కలిసికట్టుగా... మరింత బలంగా" అనే నినాదంతో రేబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కుక్క కాటు వల్లే మానవుల్లో అత్యధిక రేబిస్ కేసులు నమోదవుతున్నాయని, కుక్కలు, పిల్లులు తదితర జంతువులకు కూడా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. 2030 నాటికి కుక్కల ద్వారా సంభవించే రేబిస్ మరణాలను నిర్మూలించాలనే "జీరో బై 30" లక్ష్య సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని శుభ్రం చేయాలి.కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని ప్రవహించే నీరు, సబ్బుతో కనీసం 10--15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలని సూచించారు. గాయంపై కారం, పసుపు, సున్నం, కాఫీ పొడి, ఆకుల పసర్లు వంటి వాటిని ఉపయోగించరాదన్నారు. వైద్యుల సూచన లేకుండా గాయాన్ని గట్టిగా కట్టడం లేదా కుట్లు వేయడం చేయకూడదని తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచన మేరకు రేబిస్ నిరోధక టీకాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేబిస్ నిరోధక టీకాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలుపెంపుడు కుక్కలు, పిల్లులకు యజమానులు తప్పనిసరిగా రేబిస్ నిరోధక టీకాలు వేయించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. మూడు నెలల వయసులో మొదటి టీకా వేయించి, అనంతరం వైద్యుల సూచన మేరకు ప్రతి సంవత్సరం బూస్టర్ డోస్ ఇప్పించి రికార్డులను భద్రపరచాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు స్థానిక సంస్థలు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), సామూహిక రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వీధి కుక్కలను రెచ్చగొట్టడం, రాళ్లతో కొట్టడం, నిద్రిస్తున్నప్పుడు భయపెట్టడం వంటివి చేయకూడదని, ముఖ్యంగా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. రేబిస్ నియంత్రణ ఒక్క వైద్య, ఆరోగ్య శాఖతోనే సాధ్యం కాదని, పశుసంవర్ధక శాఖ, స్థానిక సంస్థలు, పెంపుడు జంతువుల యజమానులు, జంతు సంక్షేమ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్న 'వన్ హెల్త్' విధానంతోనే రేబిస్‌ను సమర్థవంతంగా నియంత్రించగలమన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పెంపుడు కుక్కల టీకా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్ రఫీ, ఎపిడెమియాలజిస్ట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

"కలసికట్టుగా పనిచేద్దాం - రేబిస్ మరణాలను నియంత్రిద్దాం"

## రాయలసీమ రైజింగ్‌లో భాగంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు

### "నా జిల్లా - నా పంట"పై వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

మదనపల్లె, సెప్టెంబర్ 28 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాయలసీమ రైజింగ్ -- గ్లోబల్ హార్టికల్చర్ హబ్" అవగాహన కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టును అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 29న "నా జిల్లా -- నా పంట" పేరుతో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

### జిల్లా స్థాయి పోటీలు

**చిత్రలేఖనం:**

"నా జిల్లా - నా పంట" అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహిస్తారు.

**వ్యాసరచన:**

"నా జిల్లా ప్రపంచానికి పంపబోయే పంట" అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించనున్నారు.

**"పంటను గుర్తించండి" - క్విజ్:**

విద్యార్థుల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలపై అవగాహన పెంపొందించేందుకు పంటలు, ఆకులు, పుష్పాల క్లోజప్ చిత్రాలను చూపించి వాటిని గుర్తించే విధంగా క్విజ్ నిర్వహిస్తారు. సరైన సమాధానాలు ఇచ్చిన మొదటి ఐదుగురు విద్యార్థులకు స్థానిక పండ్లను అందించనున్నారు.

### విజేతలకు ప్రత్యేక అవకాశం

జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల ప్రదర్శనలను మదనపల్లెలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో ఏర్పాటు చేసే జిల్లా ప్రదర్శన శిబిరంలో ప్రదర్శించనున్నారు. విజేతలను ప్రారంభ కార్యక్రమంలో సత్కరించనున్నారు.

### పాఠశాలలు చురుకుగా పాల్గొనాలి

జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఈ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కోరారు. సెప్టెంబర్ 28 సాయంత్రంలోగా పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించి, ప్రతి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను సెప్టెంబర్ 29న మదనపల్లెలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపించాలని సూచించారు. అలాగే పాఠశాల స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, 90 సెకండ్ల నిడివి గల వీడియోలను నిర్దేశించిన లింక్ ద్వారా పంపించాలని తెలిపారు. విద్యార్థుల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి అన్నమయ్య జిల్లా

## "ఒక మొక్క - భవిష్యత్తు కోసం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పంట మొక్కల పంపిణీ

మదనపల్లె, సెప్టెంబర్ 28 (మహి న్యూస్): "రాయలసీమ రైజింగ్ -- గ్లోబల్ హార్టికల్చర్ హబ్" అవగాహన కార్యక్రమంలో భాగంగా "ఒక మొక్క -- భవిష్యత్తు కోసం" కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా 201 క్లస్టర్ల పరిధిలోని 8, 9, 10 తరగతుల ప్రతి విద్యార్థికి జిల్లాకు చెందిన పంటకు సంబంధించిన ధృవీకరించబడిన ఒక మొక్కను అందించనున్నారు.

### ఇంటి వద్ద లేదా పాఠశాలలో మొక్కల పెంపకం

విద్యార్థులకు అందించే మొక్కలను వారి ఇంటి వద్ద లేదా పాఠశాలలో ఏర్పాటు చేసిన "పండ్ల తోట" ప్రాంతంలో నాటాలి. ప్రతి మొక్కకు సంబంధిత విద్యార్థి పేరుతో గుర్తింపు పలక ఏర్పాటు చేయనున్నారు. దీంతో విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ఉద్యాన పంటలపై అవగాహన పెరగడంతో పాటు మొక్కల సంరక్షణ పట్ల బాధ్యతా భావం పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

### సెప్టెంబర్ 28 నుంచి సన్నాహక చర్యలు

కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక చర్యలను సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు చేపట్టనున్నారు. అక్టోబర్ 1న విద్యార్థులకు మొక్కల పంపిణీ చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. విద్యార్థుల జాబితాల తయారీ, మొక్కలకు గుర్తింపు పలకల ఏర్పాటు, పాఠశాలల్లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాల గుర్తింపు తదితర చర్యలను విద్యాశాఖ చేపట్టనుంది. ఉద్యానశాఖ ధృవీకరించబడిన మొక్కలను సమకూర్చనుంది.

### మొక్కలను సంరక్షించాలి

జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించి 8, 9, 10 తరగతుల విద్యార్థులందరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. విద్యార్థులు తమకు అందిన మొక్కలను నాటి, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి అన్నమయ్య జిల్లా

## అగడూరులో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

### మహిళా భద్రతపై అవగాహన



పులివెందుల /తొండూరు మహి న్యూస్ సెప్టెంబర్ 28: వైఎస్సార్ కడప జిల్లా తొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అగడూరు గ్రామంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తొండూరు ఎస్ఐ శివ నాగిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో పర్యటించి విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో పోలీసులు మమేకమై మహిళల భద్రత, సాధికారతపై అవగాహన కల్పించారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఆపద సమయంలో పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎలాంటి గొడవలు, వివాదాలకు తావివ్వకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు సూచించారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com